క్లుప్తంగా

నిరుపేద మహిళలకు వస్త్రదానం



మహిళలకు సామగ్రి దానం చేస్తున్న కృష్ణమూర్తి, తదితరులు

బొబ్బిలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని గోపాలరాయుడిపేటలో నిరుపేద మహిళలకు పార్వతీపురం పట్టణ పోలీసు స్టేషన్‌లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్న కోమిరి కృష్ణమూర్తి శనివారం బియ్యం, వస్త్రాలు, స్టీలు సామగ్రి వితరణ చేశారు. కార్యక్రమంలో వంగపండు లక్ష్మునాయుడు, నాగిరెడ్డి సత్యం, వంగపండు తిరుపతిరావు, గండి బలరాం, బంటు శంకరరావు, బొండపల్లి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

వెంకమ్మతల్లికి పూజలు

బొబ్బిలి: అమ్మవారి కృప అందరిపైనా ఉండాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు అన్నారు. మండలంలోని రాజుపేటలో వెలసిన వెంకమ్మతల్లి ఆలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట జేసీఎస్ మండల ఇన్‌ఛార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, గ్రామస్థులు ఉన్నారు.

శ్మశానవాటిక షెడ్డు నిర్మాణం



రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో నాగావళి నది ఒడ్డున ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగార యాజమాన్యం రూ.8 లక్షలతో శ్మశానవాటిక షెడ్డును నిర్మించింది. మృతదేహాలకు దహన సంస్కరణలు చేసే సమయంలో ఇబ్బందులు లేకుండా ఈ షెడ్డు నిర్మాణం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కంపెనీ యాజమాన్యంకు ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

స్వామీ రామానంద సమాధి ఆరాధనోత్సవం

బాదంగి: మండలంలోని గొల్లాది పంచా యతీ శివారు గ్రామం కామన్నవలసలో ఉన్న స్వామీ రామానంద ఆశ్రమంలో సద్గురు రామానంద పరమహంస వారి 32వ సమాధి ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి సద్గురు అంతర్ముఖానంద స్వామి ఆధ్వర్యంలో గురుపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యోగా సాధనపై సిద్ధ భక్తులకు ఉపన్యాసం ఇచ్చారు. ఉత్సవాల్లో పరిసర ప్రాంతాలకు చెందిన సిద్ధ భక్తులతో పాటు విశాఖ, విజయనగరం, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, బెంగుళూరు నుంచి భక్తులు తరలివచ్చారు. ఆశ్రమంలో భక్తులకు అన్నసమారాధన చేపట్టారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రేగిడి: మత్తుపదార్థలైన గుట్కా, పాన్ మసాలా, ఖైనీ వంటి పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని రాజాం జీసీఎస్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం వలంటీర్లు సూచించారు. ఏఓ సీహెచ్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.పురుషోత్తంరావుతో కలిసి మునకలవలస పంచాయతీ బాలకవివలస గ్రామంలో శనివారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, విద్య, వైద్యం, పచ్చదనం పరిరక్షణ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వావిలపల్లి చంద్రశేఖర్, ఎంపీటీసీ బి.హరనాథరావు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ రాంబాబు, పీఓ తరంగి విశ్వనాథం పాల్గొన్నారు.

రాములు మాస్టారు మృతికి సంతాపం

బొబ్బిలి: పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేసి, ప్రైవేటు విద్యాసంస్థలను ప్రారంభించి ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన దోకల రాములు మాస్టారు శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన పార్థివ దేహాన్ని విజేత స్కూల్ ఆవరణలో విద్యార్థులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. ఆదివారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంగ్రేటి కేసరి ఆధ్వర్యంలో శనివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించి క్లోరినేషన్ చేశారు.

● రాజాం: పట్టణంలో ఏదైనా వార్డులో అపరిశుభ్రత నెలకొంటే వెంటనే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ సూచించారు. పట్టణంలో సారధి, మాధవబజార్, తెలగవీధి ప్రాంతాల్లో శనివారం పర్యటించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను కార్మికులతో తొలగించారు.

గ్రామాల్లో అభివృద్ధి జాడలు



బొద్దవలసలో రూ.4 లక్షలతో నిర్మిస్తున్న సీసీ డ్రైనేజీ



ఉప్పర్నాయుడువలసలో రూ.7 లక్షలతో నిర్మిస్తున్న మురుగుకాలువు



పెద్దశిర్లాంలో రూ.4 లక్షలతో నిర్మించిన సంపద సృష్టికేంద్రం

రేగిడి: గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేయగా.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసింది. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి నవరత్న పథకాలు అందిస్తూ ఆర్థికంగా ఆదుకుంటోంది. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాలువలు, మంచినీటి కుళాయిల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారంతో పరిపూర్ణ ఆరోగ్యం



తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రం-5లో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



రాజాం సిటీ: కార్యకర్తలతో సమీక్షిస్తున్న సీడీపీఓ డాక్టర్ కనకదుర్గ

తెర్లాం: ప్రతి రోజు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని ఐసీడీఎస్ సిబ్బంది పిలుపునిచ్చారు. తెర్లాంలోని 2,3,5 అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరికీ తెలియజేసేందుకు ఈ నెల 23 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం సంపూర్ణ పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తోందని, వాటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ వై.శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, సునీత, శ్రీదేవి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

● బాదంగి: పోషకాహారం ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ వివరించాలని, సుపోషిత భారతావని నిర్మాణానికి అంగన్‌వాడీ కార్యకర్తలంతా కృషిచేయాలని ఐసీడీఎస్ పీఓ కె.రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందితో సుపోషిత భారతావని నిర్మాణానికి కృషిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సక్రమంగా అందించాలని సూచించారు.

● రాజాం సిటీ: రాజాం సెక్టార్ పరిధిలోని ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా ఇంటిగ్రేషన్ ప్రోగ్రాం చేపట్టాలని సీడీపీఓ డాక్టర్ కనకదుర్గ కార్యకర్తలకు సూచించారు. పట్టణంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 23 వరకు ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించాలని, లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

పుట్టగొడుగుల సాగుతో స్వయం ఉపాధి



మాట్లాడుతున్న జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.గోవిందరావు

రేగిడి: పుట్టగొడుగుల సాగు లాభదాయకంగా ఉంటుందని జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ ఆఫీసర్ ఎస్.గోవిందరావు అన్నారు. మండలంలో ఉప్పర్నాయుడువలస గ్రామంలో యువతకు పుట్టగొడుగుల సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. నీతిఆయోగ్, ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్తంగా ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చొరవతో జిల్లా వ్యాప్తంగా ఈ శిక్షణా కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఇందులో భాగంగా రేగిడి మండలంలో కూడా శిక్షణ కార్యక్రమం ప్రారంభించామని వివరించారు. విశాఖపట్నం అనూష ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు ఈ ప్రాంత నిరోద్యోగ యువతకు ఈ నెల 18 వరకు శిక్షణ ఇస్తారన్నారు. 35 సంవత్సరాలలోపు నిరుద్యోగ యువత ఈ శిక్షణలో పాల్గొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. శిక్షణ పూర్తిచేసిన వారికి బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అనూష ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ కె.రవికిరణ్, ట్రైనర్ సంతోష్ పట్నాయక్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ గణపతి, సర్వే డీటీ కరణం సూర్యనారాయణ, పంచాయతీ సర్పంచ్ కరణం గోవిందరావు, ఎంపీటీసీ సభ్యులు పాగిరి అప్పలనాయుడు పాల్గొన్నారు.

‘మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం’ కిట్లు పంపిణీ



బూత్ కన్వీనర్లకు కిట్లు అందిస్తున్న రాజగోపాల నాయుడు, తదితరులు

రాజాం: మండలంలో దోసరి, మొగిలివలస, సీహెచ్ ఆర్‌పురం, మారేడుబాక తదితర గ్రామాల్లో శనివారం ‘మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం’ కిట్లను వైఎస్సార్‌సీపీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల సమీపంలో సమావేశాలు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. బూత్ కన్వీనర్లు, గృహసారథులు గ్రామాల్లోని ప్రతీ ఇంటికి వెళ్లి మన ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని వివరించడంతో పాటు జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేయాలని ప్రజలను కోరాలని సూచించారు. కార్యక్రమంలో రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణి, జేసీఎస్ కన్వీనర్ కామెదుల శ్రీనివాసరావు, పార్టీ బూత్ కమిటీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

బొబ్బిలి: మండలంలోని నారాయణప్పవలసలో ఇందిరాగాంధీ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం సేవా శిబిరాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు గ్రామంలో ర్యాలీ చేపట్టారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్లు పి.రామకృష్ణ, వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



గెడ్డవలసలో ఇంటింటి కుళాయిలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

రాజాం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేసిందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలో రామానుజులపేట, గెడ్డవలస గ్రామాల్లో జలజీవన్ మిషన్ కింద ఏర్పాటుచేసిన ఇంటింటి కుళాయి కనెక్షన్లను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు సుపరిపాలన అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రామానుజులపేట గ్రామంలో రూ.25.39 లక్షలతో 112 ఇళ్లకు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గెడ్డవలసలో రూ.17.01 లక్షతో వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టి, 47 ఇళ్లకు తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్‌సీపీ రాజాం మండల అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు, పార్టీ యూత్ అధ్యక్షుడు వంజరాపు విజయ్‌కుమార్, గెడ్డాపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ ముదిలి జనార్దనరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కోనారి అప్పారావు, దువ్వాడ లోకేష్, పి.సత్యారావు, ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వావిలపల్లి జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

వంగర: మండలంలో సంగాం సమీపంలోని పామాయిల్ తోటలో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వై.వి.జనార్దన్ తెలిపారు. వారి నుంచి రూ.54,400 స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

బొబ్బిలి: పట్టణానికి చెందిన దాడితల్లి తాపీ వనివారల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కర్రోతు గౌరీ శంకరరావు, మంత్రిపూడి సింహాచలం, కార్యదర్శిగా పొట్నూరు సత్యనారాయణలను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా ఉంగరాల వెంకటరావు, కొసిరెడ్డి అప్పలనాయుడు, ఆదాడ శ్రీనివాసరావులతో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నట్టు నూతన కార్యవర్గం తెలిపింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం సిటీ: మండలంలో బొద్దాం, పొగిరి సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ సురేష్ బాబు, ఏఈ వావిలపల్లి సురేష్‌కుమార్ శనివారం తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీల ఏర్పాటు

బాడంగి: బొబ్బిలి నియోజకవర్గంలోని బాడంగి, రామభద్రాపురం, తెర్లాం, బొబ్బిలి మండలాలతో పాటు బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో 264 బూత్‌లలో కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్ తెలిపారు. బాడంగి మండలంలోని 51 బూత్‌లలో కమిటీల నియామకాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఒక్కో బూత్‌లో కన్వీనర్, 12 మంది సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, జేసీఎస్ మండల కన్వీనర్ మరిపి శంకరరావు, మండల యువజన విభాగం అధ్యక్షుడు వంగపండు రమేష్, ఎంపీపీ ప్రతినిధి తెంటు మధు, రెడ్డి కృష్ణ, తెంటు తిరుపతిరావు, తదితరులు ఉన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

రేగిడి: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ ఉత్తరావల్లి సురేష్ అన్నారు. మండలంలో సరసనాపల్లి, కందిశ, చాటాయివలస సచివాలయ పరిధిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని సూచించారు. పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేలా అవగాహన కల్పించాలన్నారు. రాజాం నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ తలే రాజేష్‌ని భారీ మెజార్టీతో గెలిపించడంతో పాటు జగనన్నను మరోసారి సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, కరణం గోవిందరావు, గార రమణ, ఎంపీటీసీ సభ్యులు పాగిరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంగాంకు పోటెత్తిన భక్తులు

వంగర: మండలంలోని సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉపవాసాలు, జాగారాలు చేసిన భక్తులు శనివారం వేకువజాము నుంచి సంగాం చేరుకుని ఇక్కడి త్రివేణి సంగమం(నాగావళి, వేగావతి, సువర్ణముఖి నదులు కలిసే ప్రదేశం)లో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం సంగమేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ట్రైనీ డీఎస్పీ మహీంద్ర, రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు మజ్జిగ, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

రైతులకు ఉపయోగపడేలా ఉపాధి పనులు

రాజాం: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులు గ్రామంలోని ప్రజలకు, రైతులకు ఉపయోగపడేలా ఉండాలని ఏపీఓ కె.సాయిరాం అన్నారు. మండలంలో పొగిరి, కంచరాం, గడిముడిదాం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు వెరిఫై చేశారు. పనిలో పాల్గొనే వేతనదారుల సంఖ్య పెరగాల్సి ఉందన్నారు. ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేస్తే కనీస వేతనం రూ.270లు వస్తుందని వివరించారు. ఉపాధి పనులు పూర్తిస్థాయిలో చేపట్టిన గ్రామాల్లో మెటీరియల్ పనులకు అవకాశం ఉంటుందని వెల్లడించారు.

అన్నసమారాధన

సంతకవిటి: మండలంలో మందరాడ గ్రామంలో శ్రీముఖలింగేశ్వర శివాలయంలో శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు అనంతరం ఈ కార్యక్రమం చేపట్టినట్లు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత వావిలపల్లి బాలనాయుడు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● రాజాం: మండలంలో మొగిలివలస గ్రామంలో శివాలయంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. మొగిలివలసతో పాటు పరిసర గ్రామాల భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

● బాడంగి: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ముగడ గ్రామంలో విశాలాక్షి సహిత విశ్వేశ్వరాలయం వద్ద శనివారం మహాన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం

● సీఐ తిరుమలరావు



కవాతు నిర్వహిస్తున్న సీఐ తిరుమలరావు, కేంద్ర బలగాలు

రామభద్రపురం: ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యమని సీఐ తిరుమలరావు అన్నారు. మండలంలోని కొండకెంగువ, ఆరికతోట గ్రామాల్లో ఎస్ఐ జ్ఞానేశ్వరరావు, కేంద్ర బలగాలతో కలిసి శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల నేపథ్యంలో ముందుస్తుగా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ఆయా గ్రామాల్లో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలించే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసు చెక్ పోస్టుల వద్ద మద్యం, గంజాయి, డబ్బు అక్రమ రవాణా జరగకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామన్నారు. ఓటర్లు ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నిలకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సమాచారం ఇవ్వాలని కోరారు.

అంగన్‌వాడీల్లో మరిన్ని సౌకర్యాలు



కనిమేరకవీధి అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా చేసిన సామగ్రిని చూపిస్తున్న టీచర్

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. సాక్షం పేరుతో పలు అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా నిధులను వెచ్చిస్తూ ఆయా కేంద్రాలలో మరిన్ని సౌకర్యాలను కల్పిస్తోంది. బాడంగి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 223 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటిలో 34 కేంద్రాలను సాక్షం అంగన్‌వాడీ కేంద్రాలుగా గుర్తించింది. వాటిలో చిన్నారులకు, టీచర్లు ఉపయోగపడే ఆర్వో వాటర్ ప్యూరిఫయర్, కొన్ని కేంద్రాలకు ఎల్ఈడీ టీవీలు, పెన్ డ్రైవ్, శిశు డెస్కులు, డోర్ మాట్స్, ఎల్‌పీజీ స్టౌవ్‌లు, కుర్చీలు, సీలింగ్ ఫ్యాన్స్, వాటర్ స్టోరేజ్ డ్రమ్స్ తదితర సామగ్రి పంపిణీ చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పోషణ కిట్లు అందజేయడంతో పాటు సామ్-మామ్ పథకం అమలు చేసి నిర్దేశించిన సమయంలో చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తోంది. చిన్నారులకు తరుచూ ఆరోగ్య తనిఖీలు చేపడుతోంది. ఏఎన్ఎంల ఆధ్వర్యంలో చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని ముందుగా అంచనా వేయడం, రక్తహీనత, ఇతర ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే మెరుగైన వైద్యం కోసం ఏరియా ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌలురైతు సమస్యలు పరిష్కరించండి

● కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు



మాట్లాడుతున్న కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

సీతానగరం: కౌలురైతు సమస్యలు పరిష్కరించాలని కౌలురైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని చినబోగిలి వివేక వర్ధిని విద్యాలయంలో కౌలురైతు సంఘం, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శులు ఆర్.వి.రమణమూర్తి, ఆర్.లక్ష్మంనాయుడుల అధ్యక్షతన కౌలురైతుల సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలురైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వ రాయితీలు కల్పించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోల్లో కౌలురైతుల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను పొందుపరచాలన్నారు. 2019లో తీసుకువచ్చిన సీసీఆర్‌సీ(పంట హక్కు పత్రం) చట్టం ద్వారా కౌలురైతులకు సీసీఆర్‌సీ కార్డు ఇచ్చేందుకు భూ యజమాని సంతకం తప్పనిసరి కావడంతో సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. సీసీఆర్‌సీ కార్డులు లేకపోవడంతో పంట నష్టపరిహారం, రుణం, రైతు భరోసా పథకం సాయం రాకపోవడంతో కౌలురైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ రాయితీలన్నీ కౌలురైతులకు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు బి.సావిత్రమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, తదితరులు పాల్గొన్నారు.